

రైతు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

రైతు కుటుంబానికి సహకార సంఘం ఆసరా

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మృతిచెందిన రైతు కుటుంబానికి బాటసింగారం రైతుసేవా సహకార సంఘం ఆసరాగా నిలిచింది. పసుమాముల గ్రామానికి చెందిన శెట్టి లింగంగౌడ్ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో సభ్యుడిగా ఉన్నాడు. నాలు గు నెలల క్రితం లింగంగౌడ్ మృతిచెందాడు. దాంతో సహకార సంఘం ద్వారా రూ.25వేలను గురువారం సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ రైతు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడు తూ రైతు సంక్షేమం కోసమే సహకార సంఘం పని చేస్తోందన్నారు. రైతులను ఆదుకునేందుకు సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సం ఘం వైస్ చైర్మన్ మల్లమ్మయాదవ్, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, బాల నర్సమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, యాదిరెడ్డి, రాములు, మేనేజర్ ఐలేష్‌యాదవ్, నాయకులు జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

19న వాహనాల వేలం పాట

హయత్‌నగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఆర్టీఓ అధికారులు ఐదు సంవత్సరాలుగా సీజ్ చేసిన వాహనాలకు ఈ నెల 19న తుర్కయంజాల్ మన్నెగూడలోని ఆర్టీఓ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీఓ సుభాష్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా కార్యాలయానికి వచ్చి రూ.2,500 చెల్లించి టోకన్ తీసుకోవాలని కోరారు. వేలం పాటలో వాహనం దక్కని వారికి రూ.2000 వేలు తిరిగి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యాలయం పరిధిలో మొత్తం 188వాహనాలు ఉండగా అందులో 177 వాహనాలు స్క్రాప్‌కు, 11 వాహనాలు రోడ్డు వర్త్ వాహనాలు ఉన్నాయని తెలిపారు. బండ్లగూడ ఆర్టీసీ బస్ డిపోలో- 37 వాహనాలు, హయత్‌నగర్-1 డిపోలో 20 వాహనాలు, హయత్‌నగర్-2 డిపోలో 45 వాహనాలు, మహేశ్వరం డిపోలో- 7 వాహనాలు, మన్నెగూడ ఆర్టీఓ కార్యాలయంలో 57 వాహనాలు, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్సు డిపోలో 22 వాహనాలు ఉన్నట్లు ఆర్టీఓ తెలిపారు.

సెలవులో హైదరాబాద్ రీజియన్ మార్కెటింగ్ శాఖ జేడీ

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రీజియన్ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఇమల్లేషం బుధవారం సెలవుపై వెళ్లారు. నెల రోజులు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టరుగా ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కె. రాజశేఖర్‌రెడ్డిని గురువారం నియమించారు.



బీజేపీ మీర్‌పేట్ 1,2 అధ్యక్షులను సన్మానిస్తున్న శ్రీరాములుయాదవ్

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల

సరూర్‌నగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల పక్షాన నిలబడాలని, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ సూచించారు. బీజేపీ మీర్‌పేట్-1,2 అధ్యక్షులుగా నియమితులైన పి.భిక్షపతిచారి, టి.ముఖేశ్‌ముదిరాజ్ గురువారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో అందెలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అందెల వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునిసిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, మీర్‌పేట్‌లో పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ఆందోళనల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కీసరి హరినాథ్‌రెడ్డి, భీమ్‌రాజ్, జమునాకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడిగా దినేష్‌కుమార్ పటేల్ నియామకం



దినేష్‌కుమార్ పటేల్

చాదర్‌ఘాట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడిగా కొప్పుల దినేషకుమార్ పటేల్‌ను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి బంగారు శృతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దినేష్‌కుమార్ పటేల్ మూసారాంబాగ్ డివిజన్‌కు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది రెండో సారి. బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ సిఫార్సు మేరకు డివిజన్ అధ్యక్షుడిగా ఆయన నియమితులైనట్లు ఆమె ప్రకటించారు.

శ్రీనివాసనగర్‌కాలనీ చోరీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

● పరారీలో ఒకరు

● రెండు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్ ట్యాప్ స్వాధీనం

కొత్తపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్‌కాలనీ చోరీ కేసులో ఎల్బీనగర్ డిటెక్టివ్ పోలీసులు గురువారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో ఇద్దరు జువెనైల్ బాలికలు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూజారీ దేవరాజ్ సాగర్(23) గోల్నాకలో ఉంటూ అంబర్‌పేట అలీకేఫ్ సమీపంలోని బిస్కెట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలో ఉండే ఇద్దరు బాలికలు, మహేష్ అతడి స్నేహితులు. ఈ నలుగురూ గంజాయి, ధూమపానం సహా ఇతర చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. చోరీ కేసులో పరారీలో ఉన్న మహేష్ పాత నేరస్థుడు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. నిందితులు గోల్నాక ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. నలుగురూ కలిసి శ్రీనివాసనగర్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారని విచారణలో తేలింది. వారి వద్ద రెండు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్ ట్యాప్, రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి బాలికలను నగరంలోని జువెనైల్ హోమ్‌కు తరలించారు. దేవరాజ్ సాగర్‌ను చర్లపల్లి జైలుకు తరలించారు.

మహిళ అదృశ్యం



అంజనమ్మ

చాదర్‌ఘాట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరి వెంట ఉండేందుకు వచ్చిన మహిళ ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా రాజంపేట గ్రామ నివాసి వడ్డె అంజనమ్మ(36) ఇటీవల తన సోదరి వల్లెపు సువర్ణ అనారోగ్యంతో బాధపడుతుండడంతో మలక్‌పేటలోని క్రితిక ఆస్పత్రిలో చేర్చారు. సువర్ణ వెంట ఆస్పత్రిలో సహాయం చేసేందుకు వచ్చిన అంజనమ్మ ఎవరికి చెప్పకుండా బుధవారం రాత్రి వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సువర్ణ భర్త వల్లెపు వీరబాబు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనీటైం మద్యం గురూ..



గతంలో బెల్టు షాపులపై పోలీసుల దాడుల్లో దొరికిన మద్యం బాటిళ్లు(ఫైల్)

● ఇచ్చట 24/7 మద్యం లభించును..!

● రాత్రి ఒంటి గంటకైనా.. తెల్లవారు జామున మూడు గంటలకైనా..

● బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో ఇష్టారాజ్యంగా బెల్టుషాపులు

● మద్యానికి బానిసలై ప్రాణాలు విడుస్తున్న నిరుపేదలు

● పట్టించుకోని ఎక్సైజ్, సివిల్ పోలీసులు



సరూర్‌నగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాత్రి లేదు.. పగలు లేదు.. ఎప్పుడైనా సరే అక్కడ మద్యం అందుబాటులో ఉంటుంది. ఎక్కడో ఉన్న వైన్‌షాపుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి పక్కన ఉండే గల్లీలోనే మద్యం లభిస్తుంది.. అంతేనా.. అవసరమైతే ఫోన్‌లో ఆర్డరిస్తే చాలు ఇంటికి సైతం సరఫరా చేస్తారు.. ఇదీ సరూర్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలోని పరిస్థితి! 24గంటలూ తెరిచి ఉంచే బెల్టు షాపుల్లో ఎక్కువగా చీప్ లిక్కర్, ఇంకాస్త మెరుగైన బ్రాండు మద్యం మాత్రమే లభిస్తుంటుంది. సదరు చీప్ లిక్కర్‌కు బానిసలైన పేద, బడుగువర్గాల ప్రజలు తమ చెంతనే నిరాటంకంగా లభించే మద్యం కొనుగోలు చేస్తూ ఆర్థికంగా చితికి పోవడమే కాకుండా చివరకు అనారోగ్యం బారిన పడి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఒక్క బాలాపూర్‌లోనే గడిచిన ఏడాదిలో ఐదారుగురు యువకులు మద్యానికి బానిసలై శరీరంలోని అవయవాలు పాడై మరణించినట్టు స్థానికులు చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసే సత్యనారాయణ సైతం మద్యం తాగడం వల్ల మరణించడం గమనార్హం!

ఒక్కో గ్రామంలో పదేసి బెల్టు షాపులు

సరూర్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మీర్‌పేట్, జిల్లెలగూడ, నందనవనం, లెనిన్‌నగర్, అల్మాస్‌గూడ, రాజీవ్ గృహకల్ప, నాదర్‌గుల్, గుర్రంగూడ, బడంగ్‌పేట్, గాంధీనగర్, బాలాపూర్, మల్లాపూర్, జేఎస్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. బాలాపూర్, అల్మాస్‌గూడ, నాదర్‌గుల్‌లాంటి ప్రాంతాల్లో పదేసి చొప్పున షాపులు ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఆయా షాపులు రాత్రి ఒంటి గంట దాకా తెరిచే ఉండడం ఒక ఎత్తు కాగా.. మళ్లీ తెల్లవారు జామున మూడు గంటలకే తెరుచుకోవడం ఇక్కడ గమనార్హం! మద్యానికి బానిసలైన పేద, బడుగువర్గాల ప్రజలు ఇలా నిరంతరం తెరిచి ఉండే బెల్టుషాపులను ఆశ్రయించి తమ సంపాదనంతా మద్యానికి ఖర్చు చేస్తున్నారు. ఆ తర్వాత అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో ఖర్చుల కోసం అప్పులు చేస్తున్నారు. దీనికంతటికీ బెల్టు షాపులే కారణమని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి ఒంటి గంటకైనా, తెల్లవారు జామున మూడు గంటలకైనా వెళ్లి తలుపు కొడితే చాలు.. మద్యం అందజేస్తున్న బెల్టు షాపులు అనేకం ఉన్నాయి.

అమ్యామ్యాలు పెంచుకోవడానికే దాడులు..?

తమకు నెలవారీ వచ్చే అమ్యామ్యాలు పెంచుకోవడానికే ఎక్సైజ్, పోలీసులు అప్పుడప్పుడు బెల్టు షాపులపై దాడులు చేస్తుంటారని, ఆ తర్వాత 'సెటిల్‌మెంట్' చేసుకుని చూసీ చూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని ప్రజల నుంచి వినవస్తున్నాయి. గతంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లు కూడా ప్రస్తుతం కనిపించకుండా పోయాయి. దాంతో బెల్టు షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు జరుపుతున్నారు.

ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నట్టు..!

ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసులు సైతం బెల్టు షాపుల నియంత్రణకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పట్ల స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సదరు షాపుల నిర్వాహకులతో పాటు ఆయా ప్రాంతాల్లోని వైన్‌షాపుల నుంచి వారికి నెలవారీ మామూళ్లు అందుతుంటాయని, అందుకే బెల్టు షాపుల జోలికి వెళ్లడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రజా ప్రతినిధులు సైతం వాటిపై దృష్టి పెట్టకపోవడంతో పేద, బడుగువర్గాల యువకులు తాగితాగి ప్రాణాలు కోల్పోతున్నారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి



బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలో కొనసాగుతున్న మద్యం బెల్టు షాపులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎమ్మెల్యే, మేయర్, ఇతర ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. బెల్టుషాపుల వల్ల ఎక్కువగా దళిత సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలే మద్యానికి బానిసలుగా మారి అనారోగ్యంతో ఆస్పత్రిపాలై మరణిస్తున్నారు. దాంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఒక్క బాలాపూర్‌లోనే ఐదారుగురు ఇలా చనిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

- ఇబ్రాం శేఖర్, డిప్యూటీ మేయర్, బడంగ్‌పేట్

రూ.5కోట్లతో ఓల్డ్‌మలక్‌పేటలో అభివృద్ధి పనులు

● మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల



జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ.5కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం ఆయన జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఇంజనీరింగ్ విభాగం ఈఈ పీర్‌సింగ్, ఏఈ ముబీన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్‌కు మంజూరు చేసిన రూ.5కోట్లలో సుమారు రూ.50 లక్షల వరకు పెండింగ్ పనులున్నాయన్నారు. మిగతా రూ.4.50కోట్ల పనులు కొత్తగా మంజూరైన 25 పనులకు వెచ్చించనున్నట్లు ఆయన వివరించారు. లోతట్టు ప్రాంతమైన ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోకి వచ్చే వరద నీటి సమస్యను శాశ్వతంగా నివారించేందుకు రూ.2.50 కోట్లతో బాక్స్‌డ్రెయిన్ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పోచమ్మ ఆలయం నుంచి ఇదార్ ఏ మిలియా మసీద్ మీదుగా కృష్ణా ఆస్పత్రి, హౌసింగ్‌బోర్డు కాలనీ, శంకర్‌నగర్ మీదుగా మూసీలోకి కలిపేలా బాక్స్‌డ్రెయిన్ పనులను నాలుగు విభాగాలుగా చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా అఫ్జల్‌నగర్‌లో, మహబూబ్‌మాన్షన్‌లోని ప్రేమలతా కాలనీలో నూతన కమ్యూనిటీహాళ్ల నిర్మాణ పనులను, వాహెద్‌నగర్‌లోని ఓవైసీ ప్లేగ్రౌండ్‌లోని కమ్యూనిటీహాల్‌కు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వాహెద్‌నగర్, ఎంసీహెచ్‌కాలనీ, శంకర్‌నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, ధోబీగల్లిలో నూతన సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. వీటి కోసం మిగతా రూ.2.50కోట్లను వెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నిరుపేద కుటుంబాలకు అవసరమైన వైద్య సహాయం కోసం చేసుకున్న దరఖాస్తు మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల లబ్ధిదారులకు బుధవారం రాత్రి పంపిణీ చేశారు. 56మంది లబ్ధిదారులకు రూ.23.96లక్షల విలువ గల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అదేవిధంగా ఒకరికి రూ.లక్ష విలువ గల ఎల్ఓసీని అందజేశారు.

హామీలు అమలు చేస్తున్నాం.. అభివృద్ధి కొనసాగిస్తున్నాం

● ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



బడంగ్‌పేట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న విప్ మహేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్నదని, ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధిని కొనసాగిస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఈనెల 26నుంచి రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు సైతం ఇవ్వబోతున్నట్టు ఆయన పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు రూ.44.72కోట్లతో చేపట్టిన/చేపట్టనున్న అభివృద్ధి పనులను గురువారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కమిషనర్ పి.సరస్వతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, వివిధ పథకాలకు అర్హులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభమయిందని అన్నారు. ధరణి స్థానంలో భూభారతిని ప్రవేశపెట్టామని, దీని ద్వారా రైతులకు అన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం..

మేయర్ పారిజాతారెడ్డి మాట్లాడుతూ తమ పాలకవర్గం ఐదేళ్లుగా సమష్టి కృషితో బడంగ్‌పేట్‌ను ఎంతో అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు. 2022లో కేంద్రం నుంచి స్వచ్ఛభారత్ అవార్డును సైతం అందుకున్నామని ఆమె చెప్పారు. 2020కి ముందు బడంగ్‌పేట్ ఎలా ఉందో ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గుర్తించాలని ఆమె అన్నారు. గత ప్రభుత్వం హయాంలో 2019 నుంచి నిలిచిపోయిన స్టాంప్ డ్యూటీ నిధులను ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిందని, సదరు నిధులతో మరింత అభివృద్ధి జరుగనున్నదని ఆమె పేర్కొన్నారు.


ప్రభుత్వ పాఠశాలలను స్థానిక సంస్థల్లో విలీనం చేయాలి

డిప్యూటీ మేయర్ శేఖర్ మాట్లాడుతూ మునిసిపల్ నిధులను సాధారణ అభివృద్ధి పనులతో పాటు దేవాలయాల అభివృద్ధికి సైతం కేటాయించే వెసలుబాటు ఉన్నదని, ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించే అవకాశం మాత్రం లేకపోవడం శోచనీయమని అన్నారు. పేద వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకు మునిసిపల్ నిధులు వెచ్చించే వెసలుబాటు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, బండారి మనోహర్, బాలూనాయక్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ డీఈఈలు జ్యోతీరెడ్డి, నర్సింహరాజు, ఏఈఈ వినీల్‌గౌడ్, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి ప్రహరీ కట్టేదెన్నడో?

● అభద్రతాభావంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

● ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోని వైనం



పాఠశాల ప్రహరీ కూలిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నెలల తరబడిగా కూలిపోయిన ప్రహరీకి మరమ్మతులు లేక, చూసేందుకు అంధవికారంగా, శిథిలమై పోయి బూతు బంగ్లాల దర్శనమిస్తూ ఓ ప్రభుత్వ పాఠశాల.. ప్రభుత్వ బడులంటేనే ప్రతి ఒక్కరికీ చిన్నచూపే అనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మన్సూరాబాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ప్రహరీ కూలిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో పాఠశాల భద్రతపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు ఆనుకుని ఏర్పాటు చేసిన ఓ డాబా ఎప్పుడు ఏ క్షణాన పాఠశాల వైపు ఒరిగి ప్రాణాలకు ముప్పు తెస్తుందోనన్న భయాందోళన నెలకొంది. విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రహరీ ఏర్పాటుకు చొరవ చూపినప్పటికీ పనులు ఎందుకు ముందుకు సాగడంలేదో తెలియడం లేదని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వెంటనే ప్రహరీని చాలా పటిష్ఠంగా నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



పెయింటింగ్ లేక అంధవికారంగా దర్శనమిస్తున్న పాఠశాల భవనం

బడేనా.. బూత్‌బంగ్లానా అన్నట్లుగా..

మన్సూరాబాద్ చౌరస్తా వద్ద ప్రధాన రోడ్డుపై ఉన్న ఈ మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అటుగా రాకపోకలు సాగించే వారికి 'ఇది పాఠశాలనా.. పడావుబడిన బూత్‌బంగ్లానా..' అనే సందేహాన్ని రేకెత్తిస్తోంది. ఇందుకు కారణంగా పాఠశాలకు పెయింట్ లేక ఏళ్ల క్రితం వేసిన పెయింట్‌తోనే దర్శనమివ్వడమే. పాఠశాలకు ఏడాది కాకున్నా కనీసం రెండేళ్లకోసారి పెయింట్ వేసినా చూసేందుకు బాగుండడంతో పాటు తమ పిల్లలను కూడా పంపాలన్న ఉత్సాహం తల్లిదండ్రులకు ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

కొత్త రేషన్ కార్డుల సర్వే ప్రారంభం



ఓల్డ్‌మలక్‌పేటలో కొత్త రేషన్‌కార్డుల కోసం సర్వేచేస్తున్న దృశ్యం

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి సర్వేను ప్రారంభించింది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వివరాల ఆధారంగా వారి ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తులో పేర్కొన్న వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించారు. గురువారం నుంచి ఓల్డ్‌మలక్‌పేటలోని పలు కాలనీల్లో నూతన రేషన్ కార్డుల సర్వే ప్రారంభమైంది. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,977 కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. సైదాబాద్ డివిజన్‌లో 438, మూసారాంబాగ్ 380, ఓల్డ్‌మలక్‌పేట 849, అక్బర్‌బాగ్ 332, అజంపుర 659, చావుని 319 కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 21వ తేదీలోగా సర్వేపూర్తి చేయాల్సి ఉంది. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, సివిల్‌సప్లయ్ మూడు డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన 39మంది సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారు. ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో కొత్త కార్డుల కోసం దరఖాస్తుచేసుకున్న వారి డాటా ఆధారంగా సర్వే జరుగుంది. దరఖాస్తుదారుల వివరాలు, ఆదాయ వనరులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

రేషన్ కార్డు దరఖాస్తుల విచారణ పూర్తి చేయండి

● ఉప కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య

ఎల్బీనగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డుల దరఖాస్తులను నాలుగు రోజుల్లో విచారణ పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డుల దరఖాస్తుల విచారణ కోసం నియమించిన మున్సిపల్, రెవెన్యూ సిబ్బందితో ఆయన గురువారం సర్కిల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఒక్కో వార్డుకు మూడు విచారణ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో బృందంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఉంటారని ఆయన చెప్పారు. విచారణ బృందాలు వార్డుల్లో తమకు కేటాయించిన దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి వాస్తవాలను పరిశీలించి నివేదించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా విచారణ చేపట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో సీఓలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఊర్లనుంచి.. నగర బాట

● నగరానికి చేరుకుంటున్న ప్రయాణికులు



రైలు దిగి సికింద్రాబాద్‌కు చేరుకున్న ప్రయాణికులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరవాసులు ఊరెళ్లిపోయి తిరిగి గురువారం చేరుకున్నారు. మూడు రోజుల పాటు పండుగ జరుపుకునేందుకు వెళ్లిన వారు తిరిగి నగరబాట పడుతున్నారు. ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరిన గౌతమి, విశాఖ, గరీబ్‌రథ్, సింహపురి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు ఇతర రైళ్లలో హైదరాబాద్‌కు చేరుకున్నారు.

ట్యూషన్ ఫీజు చెల్లింపునకు ఆఖరు తేదీ 25

● అంబేడ్కర్ వర్సిటీ అధికారుల వెల్లడి

హైదరాబాద్ సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు జనవరి 25 వరకు సమయం కేటాయించామని విద్యార్థి సేవల విభాగాధిపతి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అడ్మిషన్లు పొంది, సకాలంలో ఫీజు చెల్లించలేని విద్యార్థులు జనవరి 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం అధ్యయన కేంద్రంలో లేదా.. వర్సిటీ హెల్ప్‌లైన్ నంబర్లు 040- 23680222/333 /444/555 పై సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

66 ఏళ్లు సాగిన ఆస్తి తగాదాపై హైకోర్టు తుది తీర్పు

● మక్తాపై వివాదానికి ముగింపు

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వారసుల మధ్య 66 ఏళ్ల పాటు సాగిన ఆస్తి తగాదా కేసులో గురువారం హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. నగరానికి చెందిన నవాబ్ మొయినుద్దులా బహదూర్ కుమార్తె సుల్తానా జహాన్ బేగం 1953లో తొలుత ఆస్తుల విభజన కోసం సిటీ సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారు. తర్వాత ఆ పిటిషన్ హైకోర్టుకు బదిలీ అయి సివిల్ సూట్ (సీఎస్ ఆఫ్ 7)గా నమోదయింది. ఈ కేసులో వారి మధ్య రాజీ కుదుర్చి ఒప్పందం చేసేందుకు హైకోర్టు రాజా కిషన్‌దాస్, నవాబ్ సలీంఖాన్‌లను కమిషనర్ కం రిసీవర్లుగా నియమించింది. 1959లో ప్రాథమిక డిక్రీ జారీఅయింది. 1966లో భూములు, షేర్లు, ఇతర ఆస్తుల విభజన చేసి విభజన చేసి తుది పంపిణీ స్టేట్‌మెంట్‌ను దాఖలు చేశారు. అయినప్పటికీ ఉనికిలో లేని మక్తా ఆస్తుల కోసం లిటిగేషన్ కొనసాగుతోంది. ప్రాథమిక డిక్రీలో లేని ఆస్తులను తరువాత చేర్చడం కుదరని పేర్కొన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎస్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం.. ఆ కేసును ముగిస్తున్నట్లు పేర్కొంది. 1970 నాటి ఆదేశాల ప్రకారం ఫైనల్ డిక్రీని తయారు చేసి ఇవ్వాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనిపై సుప్రీంకోర్టులో ఉన్న ఇతర కేసులపై ఈ తీర్పు ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది.